క్లుప్తంగా

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి



సమావేశంలో కౌలు రైతు సంఘం ప్రతినిధులు

టెక్కలి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు డిమాండ్ చేశారు. సుఖదేవ్‌పేట గ్రామంలో రైతులతో ఆదివారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని కూడా కౌలు రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఎస్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, జె.బాలరాజు, బి.భీమారావు, బి.సంజీవరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

● టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: డివిజన్ పరిధిలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతీ మండలంలో అధికారుల దృష్టికి వచ్చే రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం విషయంలో తాత్సారం లేకుండా చూడాలని ఆదేశించారు.

దసరా వచ్చిందయ్యా.. రద్దీ తెచ్చిందయ్యా..



కిటకిటలాడుతున్న బస్సులు

కాశీబుగ్గ: దసరా నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలకు సెలవులు ప్రకటించారు. దీంతో వివిధ ప్రాంతాల్లో చదువు కోసం వెళ్లిన విద్యార్థులు స్వగ్రామాలకు పయనమవ్వడంతో బస్సులు రద్దీగా మారాయి. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. కూర్చోవడానికి సీట్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం వెళ్లే బస్సుల్లో వేలాడుతూ ప్రయాణించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



లింగరాజుకు సాయం అందజేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన దళాయి లింగరాజు మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. అసలే పేదరికం, ఆపై చికిత్సకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన 'హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్' సభ్యులు స్పందించారు. బాధితుడికి చికిత్స కోసం ఏడు వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు సావాడ గణేష్‌రెడ్డి, నీలాపు దుర్యోధనరెడ్డి, దక్కత శంకర్, మద్ది తత్రినాథ్, పనపాన రవి ఉన్నారు.

తులసమ్మకు ప్రత్యేక పూజలు



తులసమ్మ దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టి వద్ద పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగించారు.

గోకులాల గందరగోళం!



టెక్కలి మండలంలోని చాకిపల్లిలో మినీ గోకులం

టెక్కలి నియోజకవర్గంలో గోకులాల మంజూరు		
మండలం	లక్ష్యం	ప్రస్తుతానికి వచ్చిన దరఖాస్తులు
టెక్కలి	42	26
కోటబొమ్మాళి	42	42
సంతబొమ్మాళి	42	23
నందిగాం	40	16

- 2014లో టీడీపీ కార్యకర్తలకు కాసుల వర్షం కురిపించిన గోకులాలు
- అప్పట్లో లక్ష్యం చేరని వైనం
- మళ్లీ తెరపైకి మినీ గోకులాలు

టెక్కలి: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలకు కాసుల వర్షం కురిపించిన మినీ గోకులాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇటీవల మినీ గోకులాల నిర్మాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 2014లో టీడీపీ సర్కార్ హయాంలో మంజూరు చేసిన గోకులాలు లక్ష్యాలను చేరకపోగా బిల్లులు సైతం పెండింగ్‌లో ఉండిపోయాయి. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బిల్లులను చెల్లించారు. అయితే ఈసారి మినీ గోకులాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నప్పటికీ గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తల సిఫార్సుల ప్రమేయం ఉండడంతో పాడి రైతులు, జీవాల పెంపకందారులు, పౌల్ట్రీ యజమానుల నుంచి ఆశించిన మేరకు దరఖాస్తుల ప్రక్రియ జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మినీ గోకులానికి అర్హులు..

ప్రభుత్వం ఆదేశించిన మేరకు మినీ గోకులానికి అర్హతలు నిర్దేశించారు. ఎస్సీ, ఎస్టీ, వలస చెందిన వారు, డీ నోటిఫైడ్ తెగవారు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు, మహిళా యజమానులు, అంగ వైకల్యం యజమాని కుటుంబాలు, పీఎంఏవైజీ లబ్ధిదారులు, అటవీహక్కు చట్టం–2006 లబ్ధిదారులు, చిన్న, సన్నకారు రైతులు అర్హులు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ భాగస్వామ్యంతో గోకులాలు నిర్మాణం చేయనున్నారు.

మళ్లీ గోకులాల పేరుతో దోపిడీ



2014లో టీడీపీ హయాంలో మినీ గోకులాల పేరుతో అప్పట్లో గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు కమీషన్లు దండుకున్నారు. అప్పట్లో ఈ గోకులాలు లక్ష్యం చేరలేదు. ఇప్పుడు మళ్లీ మినీ గోకులాలు అంటూ ప్రభుత్వం ఆశ చూపుతోంది.

–సత్తారు సత్యం,
పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టెక్కలి

గోకులాలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు			
షెడ్లు	యూనిట్ వ్యయం (రూపాయల్లో)	ప్రభుత్వం నిధులు (రూపాయల్లో)	రైతు వాటా (రూపాయల్లో)
2 పశువులు	1,15,000	1,03,000	11,500
4 పశువులకు	1,85,000	1,66,500	18,500
6 పశువులకు	2,30,000	2,07,000	23,000
20 జీవాలు	1,30,000	91,000	39,000
50 జీవాలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్!

● వేరేచోటుకు మార్చాలని ప్రజల వినతి



జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఇచ్ఛాపురం రూరల్: జనావాసాల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండపల్లి గ్రామ సచివాలయానికి ఎదురుగా బుడ్డేపు గ్రామానికి వెళ్లే మలుపులోని స్తంభానికి చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీంతో చాలామంది అనుకోకుండా విద్యుద్ఘాతానికి గురవుతున్నారు. స్తంభం పక్కనే దుకాణాలు ఉండటంతో సాయంత్రం సమయాల్లో వృద్ధులు సేద తీర్చుకోవడం, చిన్నారులు ఆటలు ఆడుకుంటుండటంతో పలుమార్లు షాక్‌కు గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటకు మార్చాలంటూ సంబంధిత అధికారులకు కోరినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామ పంచాయతీలో వీధి లైట్లు వేలగడం లేదని, మార్చాలంటూ సచివాలయం విద్యుత్ లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ పిట్ట శశిరేఖ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రదేశానికి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులపై చర్యలకు వినతి



బాబూరావుకు వినతిపత్రం అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావును పలాస వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం అతన్ని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కోనేరును ఆనుకొని ఉన్న పార్కులో మహిళలు, బాలికలు, చిన్నారులు వ్యాయామం, నడక సాగిస్తుంటారని అటువంటి పార్కులో మందుబాబులు తిష్టవేస్తున్నారని బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. మందుబాబులతో ఇబ్బందికరంగా పరిసరాలు మారుతున్నాయని చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కోనేరు చుట్టూ పెన్సింగ్, లైటింగ్, వాటర్ క్లోరినేషన్, పాడైన ట్రాక్ మరమ్మతులు వంటి విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా'



మాట్లాడుతున్న శ్రీనివాసులునాయుడు

సోంపేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో ఆదివారం మండల అధ్యక్షుడు దాలిబందు ఆధ్వర్యంలో యూనియన్ ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగిస్తున్న జీవో నంబర్ 117, సీపీఎస్ రద్దు, ఏకీకృత సర్వీసు రూల్స్ సాధన ధ్యేయంగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు మురళీమోహన్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రాజశేఖర్, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస మండలాల పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

యువకుల ఔదార్యం



శ్రమదానం చేస్తున్న యువజన సంఘం సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పల్లిసారధి జనచైతన్య ఆర్ట్స్ యువజన సంఘం సభ్యులు ఆదివారం శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పల్లిసారధి నుంచి గొల్లసారధి వరకు రోడ్డు కిరువైపులా పేరుకుపోయిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలిగించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఉప్పరపల్లి వాసుదేవ్, గ్రామ పెద్దలు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, బత్తిని హేమంత్, పోతనపల్లి ధర్మారావు, వనమాల గణపతి ఉన్నారు. అలాగే శ్రీఅసిరిపోలమ్మ ఆటో యూనియన్ దోకులపాడు, చినవంక, పల్లిసారధి సభ్యులు చినవంక నుంచి తళబద్ర వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.

సాయి భక్తులు ఆర్థిక సాయం



దేవందర్‌కు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సోంపేట: గార గ్రామానికి చెందిన పాట్నూరు నవీన అనారోగ్యంతో బాధపడుతుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం కోసం సాయిభక్తులను కలిశారు. నవీన కుమారుడు దేవేందర్‌ను సోంపేట సత్యసాయి మందిరానికి ఆదివారం రప్పించి రూ. పది వేలు ఆర్థిక సాయాన్ని సత్యసాయి సేవాసమితి యువజన విభాగ సభ్యులు అందజేశారు.

ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు నేటి నుంచి శిక్షణ

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు సోమ, మంగళవారం రెండు రోజులు 'జీపీడీపీ'పై శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక మండలాభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం పది నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిక్షణకు సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

నింబాషిణి అమ్మవారికి జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న పిరియా విజయ

సోంపేట: సోంపేట గ్రామ దేవత నింబాషిణి అమ్మవారిని దుర్గానవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, పార్టీ నాయకులు పలువురు ఉన్నారు.

అమ్మవారి ఆలయానికి ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లను ఆలయ కమిటీకి అందిస్తున్న దాతలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి ఆలయంలో నూతనంగా మండపం నిర్మించారు. దీనికి అవసరమైన సీలింగ్ ఫ్యాన్లను పలువురు దాతలు వితరణ చేశారు. ఫ్యాన్లు ఇచ్చిన వారిలో కిల్లి సత్యానందం, కొల్లి వెంకట జగన్నాథరావు, బనిశెట్టి మోహనరావు, వంకల సోమేశ్వరరావు, కొర్రాయి కురయ్య, కాయ రాము, సాలిన లక్ష్మణమూర్తి ఉన్నారు. వీటిని ఆలయ కమిటీ ప్రతినిధులుక ఆదివారం అందజేశారు.

ఘనంగా కొండపోలమ్మ ఉత్సవాలు



అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలోని కొండపోలమ్మ అమ్మవారి ఉత్సవాలను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజయదశమికి ముందుగా వచ్చే ఆదివారం కాలనీకి చెందిన ప్రజలంతా భక్తిశ్రద్ధలతో సంబరాలు నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ మేరకు ప్రజలంతా కలసి అమ్మవారి ప్రతిమలను మేళతాలు, భక్తిశ్రద్ధల నడుమ కాలనీలో ఊరేగిస్తు సంబరాలు నిర్వహించారు.

సామూహిక కుంకుమార్చనలు



కవిటి: సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు



కాశీబుగ్గ: దీపారాధనలో భక్తులు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం గొండ్యాలపుట్టుగలోని భూలోకమాత ఆలయంలో పెద్ద సంఖ్యలో మహిళలచే సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. పురోహితుడు చంద్రశేఖర్ శతపతి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమార్చనల పూజలు విశేష హోమాలు జరిగాయి.

ఘనంగా దీపారాధన

కాశీబుగ్గ: పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి గ్రామంలో ఆదివారం రాత్రి సండమ్మతల్లి ఆలయం వద్ద దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నైరేడ్ ద్వారా స్వయం ఉపాధిలో శిక్షణ

కంచిలి: నాగావళి స్వయం ఉపాధి సంస్థ (నైరేడ్) ద్వారా ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే సెప్టెంబర్ 27వ తేదీ నుంచి ఒక బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమైందన్నారు. మగవారికి ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, జెంట్స్ టైలరింగ్, కంప్యూటర్ టాలి అండ్ బేసిక్స్ శిక్షణ 30 రోజులు పాటు ఇస్తామన్నారు. అలాగే మహిళలకు టైలరింగ్, హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గం వర్క్ విభాగాల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలతోపాటు యూనిఫాం, టూల్‌కిట్‌లు ఇస్తామని అన్నారు. ఆసక్తి ఉన్నవారు విజయనగరం జిల్లా రాజాం పట్టణంలోని జీఎంఆర్ కేర్ ఆస్పత్రి పక్కన ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానం ప్రకారం ఈ నెల తొమ్మిదో తేదీ లోగా దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కొయిలాడ బేబి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సోంపేట, కంచిలి, మందస మండలాల్లో 12 ప్రైవేట దుకాణాల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సోంపేట మండలంలో ఐదు, కంచిలిలో రెండు, మందసలో ఐదు దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ దరఖాస్తుకు రెండు లక్షల రూపాయల రుసుము చెల్లించాలన్నారు. అయితే చెల్లించిన రుసుం తిరిగి ఇవ్వబడదని స్పష్టం చేశారు. దుకాణాలను ఈ నెల 11వ తేదీన లాటరీ ద్వారా కేటాయిస్తామని.. ఆసక్తి ఉన్న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా...

టోల్‌గేట్ వద్ద నిలిచిపోయిన వాహనాలు



బారులుతీరిన ఇచ్ఛాపురం వైపు వెళ్లే వాహనాలు

కాశీబుగ్గ: లక్ష్మీపురం జాతీయ రహదారిపై టోల్ గేటు వద్ద ఆదివారం 12.30 గంటల సమయంలో వాహనాలు నిలిచిపోయాయి. బిల్లింగ్ పాయింట్‌ల వద్ద తలెత్తిన సాంకేతిక సమస్యతో కొన్ని లారీలు నిలిచిపోయాయి. తరువాత వాటి వెనుక నుంచి వాహనాలు కూడా నిలిచిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ సమస్య నెలకొంది.

ఇరిగేషన్ ఏఈగా శ్రీనివాసరావు

కాశీబుగ్గ: మందస మండల ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎస్వీ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పంటలకు ఆటంకం లేకుండా సాగునీటిని అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

రాయితీపై జీడి మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండలం హరిపురంలో ఉద్యానవనశాఖ అధికారులు రాయితీపై రైతులకు జీడి మొక్కలను ఆదివారం పంపిణీ చేశారు. మందస మండల ఉద్యానశాఖ అధికారి శంకర్ దాసు, నాయకులు భావన దుర్యోధన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, లబ్బ రుద్రయ్య, ముడుమంచి నవీన్‌కుమార్, కోత్ర వైకుంఠరావు, బదకల వెంకట్రావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి నిజరూప దర్శనం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారు నిజరూప దర్శనం సోమవారం ఉదయం ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంకల సోమేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దత్తత గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నేటితో ఈకేవైసీ గడువు పూర్తి

సోంపేట: వరిపంట ఈక్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈకేవైసీని కూడా సోమవారంలోగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి సూచించారు. టి.శాసనాం గ్రామంలో ఈకేవైసీ ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ఈకేవైసీ నమోదుకు సోమవారం చివరి రోజని అన్నారు. మండలంలో 9,039 ఎకరాల్లో వరిసాగు చేయగా 8,600 ఎకరాలకు రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, మిగతా వారు సోమవారం చేయించుకోవాలన్నారు.

మందస తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కాశీబుగ్గ: మందస తహసీల్దార్‌గా ఎస్.హైమావతి బాధ్యతలు స్వీకరించారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. సిబ్బంది ఆమెకు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందించారు.

శ్రమదానంతో గండి పూడ్చివేత

కాశీబుగ్గ: మందస మండలంలోని సున్నాముది గెడ్డ ప్రవాహంతో చిక్కిడిగాం బట్టికి పెట్టువ గ్రామం వద్ద గండిపడింది. దీంతో పంట పొలాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా పోతుంది. దీంతో దిగువ ప్రాంత రైతులంతా ఏకమై శ్రమదానంతో గండిని ఆదివారం పూడ్చారు. విషయం తెలుసుకున్న మందస మండల ఏఈ శ్రీనివాసరావు రైతుల సమస్యను తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి మరమ్మతులు చేపడతామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సోంపేట: మండలంలోని పాలవలస జాతీయ రహదారి వద్ద ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో పాలవలస గ్రామానికి చెందిన పొందర వెంకటరావుకు గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితునికి సాయం చేసి 108 ద్వారా పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జెడ్పీటీసీ స్పందించిన తీరుకు పలువురు స్థానికులు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల విజేత గాయిత్రి స్కూల్



బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేవీనవరాత్రి మహోత్సవాలు సందర్భంగా దోకులపాడులో గంగాధర సేవా సంఘం ఆధ్వర్యంలో పూజా కమిటీ నిర్వహణలో ఆదివారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలో 27 జట్లు పాల్గొనగా మండలంలోని గరుడబద్రలో ఉన్న గాయిత్రి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే చినబడాంలోని సాయిశిరీష, హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల చేతులు మీదగా బహుమతులు అందజేశారు.

యువకుల ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్సులో గ్రామస్తులు

కాశీబుగ్గ: చిన్ననీలావతి గ్రామానికి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలను గ్రామస్తులు శ్రమదానం ద్వారా తొలగించారు. ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు కిలోమీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టి ఆదర్శంగా నిలిచారు.

అన్నప్రసాదం వితరణ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 11వ వార్డు బ్రాహ్మణవీధిలో దుర్గామాత మహోత్సవాలు సందర్భంగా భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. నిర్వాహకులు చంద్రశేఖర్‌త్యాడి, సంతోష్‌పండా, నిత్యానందపండా పాల్గొన్నారు.